ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



(హైదరాబాద్‌లో శ్రీనాన్నగారి ప్రవచనము, 18-10-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఏవస్తువు అయితే నిత్యమైనదో, ఏవస్తువు అయితే సత్యమైనదో ఆవస్తువు అందరి హృదయాలలోనూఉంది. ఆవస్తువు యొక్క స్వరూపమే సుఖము, ఆవస్తువు యొక్క స్వరూపమే ఆనందము. దానినే భగవంతుడు, శక్తి అంటున్నారు. ఆశక్తికి భిన్నంగా మనంలేము. ఆశక్తి అందరిలోనూ పని చేస్తోంది, అంతటా పనిచేస్తోంది, ఆశక్తి  ఎలా ఆడిస్తే మనం అలా ఆడుతున్నాము. ఆ శక్తే దైవము అనే భావన ఎవరికైతే స్థిరపడిందో వారు ఇప్పడే ఇక్కడే విశ్రాంతి తీసుకొంటారు అంటే శాంతి కలుగుతుంది. దేహానికి నేను అనే తలంపులేదు, చైతన్యానికి నేను అనే తలంపులేదు. మధ్యలో ఏదో ఒక వస్తువు జీవుడు అని చెప్పండి, మనస్సు అని చెప్పండి మనకు నేనుగా వ్యక్తమవుతోంది, మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దాని మూలం బయటలేదు. నీలోపలే ఉంది

గాఢనిద్రలో ఉన్నప్పడు మనం సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము, పూర్వజన్మగురించి గాని, రాబోయే జన్మగురించి గాని ఆలోచనలు లేకుండా ఉన్నాము. జాగ్రదావస్థలోనికి రాగానే ఆలోచనలు వచ్చేస్తున్నాయి, సుఖం, శాంతి,ఆనందం లేదు. గాఢనిద్రలో ఉన్నసుఖం, శాంతి జాగ్రదావస్థలో పొందలేకపోవటానికి నీ లోపలున్న అహంభావనే కారణం. మనం ఇల్లును విడిచిపెట్టగలము, సమాజమునువిడిచిపెట్టగలము. వీటిని విడిచి పెట్టినంత తేలికగా అహంభావమును విడిచిపెట్టలేము. ఎవడైతే అహంభావనను విడిచిపెట్టలేదో వాడు ఎక్కడ ఉన్నా ఒకటే. వాడిని దు:ఖం వెంటాడుతూఉంటుంది. అహంభావన మూలం నీహృదయం లోనే ఉంది. నీవు ఇంద్రియాలను, మనస్సును నిగ్రహించుకొని హృదయంలోనికి ప్రవేశిస్తే అహంభావన మూలం నీకు తెలుస్తుంది. అహంభావన మూలం నీకు ఎప్పడైతే తెలిసిందో అప్పడు అహంభావన నశిస్తుంది. ఎక్కడైతే అహంభావన నశించిందో అక్కడ ఆనందం తెలుస్తుంది. అహంభావన మూలం తెలియకపోతే నీవు కోట్లాది జన్మలు ఎత్తిన మోక్షశాంతిని పొందలేవు. మనం చేసే పని, మనం మాట్లాడే మాట, మన ఆలోచన మన అహంభావన తగ్గించేదిగా ఉండాలి.

మనం శరీరం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాము. మనస్సుకు వచ్చే ఆలోచనల విషయంలో జాగ్రత్తగా ఉండము. ఇదే మనలోని పొరపాటు. శరీరానికి రోగం వస్తే చాలా జాగ్రత్తలు తీసుకుంటాము. మనస్సులోనికి చెడు ఆలోచనలు వస్తే వాటి గురించి పట్టించుకోము. నీకు దు:ఖం వస్తుంటే ఇంట్లో బయట ఎన్ని ఉన్నా నీకు ఏమిటి ప్రయోజనం. నీవు దు:ఖం లేని స్థితిని పొందాలి. దానికి నీమనస్సు సహకరించాలి. నీమనస్సును స్వాధీనం చేసుకోవడానికి జపం, ధ్యానం, సత్‌పురుషుల సహవాసం

నీకు సహకరిస్తాయి. మనస్సును దాని మూలములోనికి ఉపసంహరిస్తే అక్కడ అది నశిస్తుంది. నీవు జీవన్ముక్తుడవుతావు. దు:ఖం లేని స్థితికి ఎదుగుతావు. దు:ఖం లేని స్థితిని పొందినప్పడు ఆస్థితినే కొంతమంది వైకుంఠమని, కొంతమంది కైలాసం అని రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. ఉన్న స్థితి ఒక్కటే అది బాహ్యంగా బజారులో కొనుక్కునే వస్తువు కాదు. నీదేహాన్ని, మనస్సుని, ఇంద్రియాలను స్వాధీనం చేసుకొని ఆస్థితిని పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. దానికి గురువు యొక్క సహాయం ఉంటుంది. మనహృదయంలో సత్యవస్తువు ఉన్నప్పటికి మన ఆలోచనలో ఉన్న దోషం వలన అది మనకు తెలియడంలేదు. మన ఆలోచన సక్రమంగా ఉంటే మనం చేసే పని సక్రమంగా ఉంటే కాలక్రమంలో ఆవస్తువు తనంతటతానుగా మనకు ఎరుక పడుతుంది.

ఇతరులను విమర్శించే బదులు నిన్ను నీవు విమర్శించుకో, ఇతరులను విమర్శించటం వలన రజోగుణం పెరుగుతుంది. నిన్ను నీవు విమర్శించుకోవటం వలన సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం పెరిగేకొలది తమోగుణం, రజోగుణం తగ్గుతాయి. కొంతమంది స్వార్ధం ప్రేరణగా వాసన ప్రేరణగా పనిచేస్తారు. కాని జ్ఞానికి స్వార్ధం లేదు, వాసనలేదు. వాసనలు పూర్తిగా క్షయిస్తేనేగాని బ్రహ్మానుభవం కలగదు. అందుచేత జ్ఞాని ఏపని చేసిన ఈశ్వరునిచేతిలో పనిముట్టుగా ఉంటాడు. కాని ఆపని వెనకాల ప్రేరణగా వాసనగాని, స్వార్ధంగాని ఉండదు. మాయలో ఉన్నప్పడు ఎక్కువ, తక్కువఅనే బుద్ధి మనకు కలుగుతుంది. అంతా తానే అనుకొన్నప్పడు ఎక్కువ, తక్కువలేదు. బ్రహ్మానుభవం పొందినవాడికి బేధం కనబడదు. వాడి హృదయంలో ఏదైతే దర్శించాడో అదేవాడికి లోకంలో కూడా కనబడుతుంది. అజ్ఞాని సత్యాన్ని ఒక నామమునకు, ఒకరూపమునకు పరిమితం చేస్తాడు. జ్ఞాని ఒక రూపానికో, ఒకనామానికో సత్యాన్ని పరిమితం చేయడు. నీ హృదయంలో ఉన్న శాంతినీకు అందినప్పడు, అదేనీకు స్వరూపంగా వ్యక్తమయినప్పడు స్వర్గం గురించిగాని, నరకం గురించిగాని, మరణానంతర జీవితం గురించిగాని అసలు నీకు తలంపులేరావు.

నీమనస్సులో అనేక తలంపులు ఉంటాయి. రమణమహర్షి బోధలో ఉన్న గొప్పతనం ఏమిటి అంటే నీకు పైపైన వచ్చే తలంపులను చూసి నిన్ను అక్కడ విడిచిపెట్టడు. నీమనస్సు యొక్క మూలాన్ని నీచేత అన్వేషింపచేసి నీమనోమూలంలోనికి నిన్ను తీసుకొనిపోయి మనోమూలంలో ఉన్న వస్తువును నీచేత దర్శింప చేయటమే ఆయన బోధయొక్క లక్ష్యంగాని నీమనస్సులో వచ్చే పైపై తలంపులతో ఆయన సందేశం ఆగదు. మీరే ఆత్మ, మీరే చైతన్యం అని చెపుతున్నారు అది మాకు అర్ధం కావటంలేదు అని అడుగుతున్నారు. అది మీకు అర్ధం అవ్వకపోవటానికి మీనామబుద్ధి, రూపబుద్ధి కారణం. అసలు వస్తువుకు రూపం లేదు, నామం లేదు. మనబుద్ధి రూపమునకు, నామమునకు పరిమితమైఉంది. మనం రూపం నుండి, నామంనుండి విడుదలపొందినప్పడు రూపము నామములేని వస్తువు తానుగా వ్యక్తమవుతుంది. భగవంతుని ధ్యానించగా, ధ్యానించగా మనం రూపబుద్ధి నుండి, నామబుద్ధి నుండి విడుదల పొందుతాము.

ఏకవస్తువు మీద మనస్సును నిలబెట్టి ఉంచటమే ధ్యానం. ధ్యానం చేయగా చేయగా వాడిమనస్సులో ఇతర ఆకారాలకు, వికారాలకు చోటుతగ్గిపోతూ ఉంటుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి

అడ్డువచ్చేఅలవాట్లకు మనస్సులో చోటు తగ్గిపోతూ ఉంటుంది. అప్పుడు వాడు పవిత్రుడు అవుతాడు, వాడికి ఏకాగ్రతవస్తుంది, జిజ్ఞాసకలుగుతుంది. మనస్సుబాహ్యంగా విజృంభిస్తూ ఉంటుంది. దానిని ఉపసంహరించటం కష్టం. మీరు ధ్యానం చేసి ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో ఆవైపుకు నీ మనస్సును ఒక్క అంగుళం దింపగలిగితే మీరు ధన్యజీవులే. భగవదనుభవం పొందటంకోసం అవసరమయితే నీవు అనుభవించే భోగాలను త్యాగంచేయాలి. నీవు అనుభవించే భోగాలను విడిచిపెట్టటం కూడాతపస్సే. కర్మఫలాన్ని ఆశిస్తున్నంత కాలం మనకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. కర్మఫలముపట్ల ఎవడైతే స్పృహలేకుండా ఉన్నాడో వాడికి చిత్తశుద్ధి కలుగుతుంది, మోక్షం కలుగుతుంది. ఎవడైతే కర్మఫలత్యాగో వాడే సన్యాసి, వాడే యోగి.

ఆధ్యాత్మికవిద్య నీకు శాంతిని కలుగజేస్తుంది. నీకు బ్రహ్మానుభవం ఎప్పడైతే కలిగిందో నీవేకాదు పరిసరాలు కూడా శాంతిగా ఉంటాయి. దక్షిణామూర్తి మౌనంగా ఉంటే శిష్యులకు వారిహృదయంలో ప్రకాశిస్తున్న సత్యంవారికి ఎరుకపడింది. అదిమౌనం. దక్షిణామూర్తిలో ఏశక్తి అయితే పనిచేసిందో ఆశక్తే ఇప్పడుకూడా పనిచేస్తోంది. ఉన్నది ఒక్కటే శక్తి. దేహాలలో మార్పుకాని శక్తిలో మార్పులేదు. శక్తి మాత్రం అదే. మోక్షస్థితి లేదు అని అనుకోవద్దు. సవినయంగా, సుస్పష్టంగా మీకు ఒక విషయం మనవి చేస్తున్నాను. మోక్షస్థితిని పొందే అర్హత మనకు లేకపోవటం వలన మనం దానిని పొందలేక పోతున్నాము అంతేగాని మోక్షస్థితి లేదని అనుకోవద్దు. మోక్షస్థితి ఉందా, లేదా, దేవుడు ఉన్నాడా లేడా అని సందేహిస్తున్నావు. అలా సందేహించేబదులు నీ అహంభావనను సందేహించు. అప్పడు అహంభావన దాని మూలంలోనికి ప్రయాణంచేసి అక్కడ ఐక్యమవుతుంది. ఈసృష్టిలో ఏమీ దోషంలేదు, నీదృష్టిలోనే దోషం ఉంది. ఇతరులకు జ్ఞానం ఉంది అనుకోండి, మంచి గుణాలు ఉన్నాయి అనుకోండి వాటిని చూసి నీవు సంతోషించాలి. సంతోషించటం వలన అవి నీకు వస్తాయి. ఇది కూడా సాధనలో ఒకభాగమే. ఇతరులను చూసి అసూయపడవద్దు. అసూయ పడటంవలన నీవే నష్టపోతావు. ఇతరులలో ఉన్న మంచిని చూడటం నేర్చుకొంటే ఆమంచి గుణాలు వచ్చి నిన్ను వరిస్తాయి. పూజ, జపం చేయటమేసాధన అనుకొంటున్నారు. ఎదుటివారిలో ఉన్న మంచిని చూసి ఆనందించటం కూడా సాధనలో ఒకభాగమే.

మహాత్ముల సమక్షంలో, జ్ఞానుల సమక్షంలో, మహాగురువుల సమక్షంలో నీవాసనలు అణుగుతాయి, అలవాట్లు తొలగుతాయి, నీమనస్సు నిశ్చలం అవుతుంది, నిర్మలం అవుతుంది, నీబుద్ధికి వివేకం కలుగుతుంది. నీకు సమాధిస్థితి కలుగుతుంది. సమాధిస్థితిలో నీకు విషయములు ఉండవు. నీకు లోకం గొడవ ఉండదు, దేహం గొడవ ఉండదు, దేవుడు గొడవ ఉండదు. వాడు ఉన్నాడు అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది. అది సమాధి స్థితి. ఇంద్రియాలు పనిచేస్తున్నప్పటికి ఎవడి మనస్సు అయితే పూర్ణశాంతిలో ఉంటుందో అది సహజ సమాధి ----